TGTEL/26/A7716

# ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 14 | ఆదివారం | 26.09.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

## భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం..

### అంతర్జాతీయ వేదికపై భారత్‌కు పెరుగుతున్న మద్దతు

- భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం కోసం భారత్ ప్రయత్నాలకు పెరుగుతున్న మద్దతు
- భారత్‌కు పోర్చుగల్, మారిషస్ దేశాల నుంచి బహిరంగంగా మద్దతు ప్రకటన
- భారత్‌తో కూడిన జీ4 కూటమికి మద్దతు పలికిన మార్షల్ ఐలాండ్స్

2

## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలు.. బీజేపీ తీవ్ర ఎదురుదాడి

- ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టిన బీజేపీ
- ఇవి సిగ్గుచేటైన, నిరాధార ఆరోపణలన్న రవిశంకర్ ప్రసాద్
- గెలవలేకనే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ దాడి చేస్తోందని విమర్శ
- అధికారం కోసమే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్న సంబిత్ పాత్ర

2

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..

### ప్రభుత్వం కీలక ప్రకటన

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు

2




# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

### - ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య
- మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస

**ఉద్యమపోరు, హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ......

2

## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

- హైకోర్టు తీర్పుపై రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు

**ఉద్యమపోరు, హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## బాలాపూర్ రికార్డు బద్దలు..

### దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!

- దక్కించుకున్న స్థానిక భక్తుడు రాజేష్
- ఇక్కడే మరో లడ్డూకు రూ.25 లక్షలు
- వేలం నిర్వహించిన జై గణేశ్ యూత్ అసోసియేషన్
- వేలం నిధులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్న నిర్వాహకులు

2

## 'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'..

### రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్

- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు
- కాంగ్రెస్ లక్ష్యం గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తేవడమేనని ఆరోపణ
- రేవంత్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్న భండారీ
- ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన

2

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు

2

## గణేశ్ నిమజ్జనం సక్సెస్..

### పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

- హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం
- విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు
- సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ట్యాంక్‌బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

2

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

**- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**మొదటిపేజీ తరువాయి..** అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల.. 70.07 శాతం ఉత్తీర్ణత

**ఉద్యమపోరు, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలు.. బీజేపీ తీవ్ర ఎదురుదాడి

**మొదటిపేజీ తరువాయి..** కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ)ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని, ఇది గర్హనీయమని ఆ పార్టీ నేతలు విమర్శించారు. ఈసీలో అంతర్గత విభేదాలున్నాయంటూ వస్తున్న వార్తలను ఖండిస్తూ కమిషన్ స్వయంగా ఒక ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో, బీజేపీ ఈ ఎదురుదాడికి దిగింది. శనివారం బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈసీపై నిరాధారమైన, అభ్యంతరకరమైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. "ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ విషయాన్ని ఈసీ ఇప్పటికే స్పష్టంగా వివరించింది. అయినప్పటికీ కాంగ్రెస్ విమర్శలు చేయడం దురదృష్టకరం" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు సుప్రీంకోర్టులో సవాలు చేయగా, ఉన్నత న్యాయస్థానం ఆ ప్రక్రియను సమర్థించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు.. ప్రభుత్వం కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి..** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం..

**అంతర్జాతీయ వేదికపై భారత్‌కు పెరుగుతున్న మద్దతు**

**మొదటిపేజీ తరువాయి..**
ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో (UNSC) శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయ వేదికపై మద్దతు పెరుగుతోంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న 81వ సర్వసభ్య సభ (UNGA) సమావేశాల్లో పలు దేశాలు భారత్ వాదనకు అండగా నిలిచాయి. పోర్చుగల్, మారిషస్ దేశాలు నేరుగా భారత్‌కు మద్దతు ప్రకటించగా, మార్షల్ ఐలాండ్స్ జీ4 కూటమికి జై కొట్టింది. భద్రతా మండలిని ప్రస్తుత రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా విస్తరించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సమావేశాల సందర్భంగా పోర్చుగల్ ప్రధాని లూయిస్ మోంటెనెగ్రో మాట్లాడుతూ, భద్రతా మండలిలో ప్రాతినిధ్యం పెరగాలని, ఆఫ్రికా, బ్రెజిల్, భారత్‌లకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ అత్యంత స్పష్టమైన మద్దతును ప్రకటించారు. "ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రకు అనుగుణంగా, శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశ అభ్యర్థిత్వాన్ని మేం సమర్థిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. జీ4, ఎల్69 గ్రూపుల వాదనలకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లతో కూడిన జీ4 కూటమికి కూడా మద్దతు లభించింది. మార్షల్ ఐలాండ్స్ అధ్యక్షురాలు హిల్డా హీన్ మాట్లాడుతూ, "భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం జపాన్, దాని జీ4 భాగస్వాములకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని ప్రకటించారు. దీని ద్వారా ఆమె పరోక్షంగా భారత్‌కు మద్దతు పలికినట్టయింది. ఈ సమావేశాల్లో ఆఫ్రికా దేశాల నుంచి సంస్కరణల కోసం అత్యంత బలమైన గళం వినిపించింది.

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

**- ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ**

**మొదటిపేజీ తరువాయి..**
భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మంది లో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది. ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ECINET పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది. అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది.

## 'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'..

**రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్**

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను భండారీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. రేవంత్ 'గాంధీ పరివార్' కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

**'కాంగ్రెస్ లక్ష్యం అదే' అంటూ ఆరోపణ**
రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ లక్ష్యాన్ని బయటపెట్టాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం గాంధీ కుటుంబాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాల కంటే కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. గాంధీ-వాద్రా కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించిన భండారీ పలు చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 26/11 ముంబయి ఉగ్రదాడుల సమయంలో భారత స్పందన వంటి అంశాలను ఆయన గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం, దేశ ఆర్థిక పరిస్థితి, పేదరికం వంటి అంశాలపైనా వ్యాఖ్యలు చేశారు.

**అసలు రేవంత్ ఏం అన్నారు?**
నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ భవిష్యత్తు కోసం 'గాంధీ పరివార్', 'సంఘ్ పరివార్' మధ్య పోరు జరుగుతోందని అన్నారు. గాంధీ కుటుంబానికి చెందిన పలువురు దేశం కోసం త్యాగాలు చేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తనకు మిగిలిన రాజకీయ లక్ష్యమని కూడా చెప్పారు.

## బాలాపూర్ రికార్డు బద్దలు

**దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు..!**

**మొదటిపేజీ తరువాయి..** భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌లతో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు వెచ్చించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది. ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## గణేశ్ నిమజ్జనం సక్సెస్..

**పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్**

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
శనివారం 26.09.2026

## నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాల సాధనకు జీవితాన్ని అంకితం చేసిన

# ఉద్యమ యోధుడు

# కొండా లక్ష్మణ్ బాపూజీ

**ఉద్యమపోరు, ప్రత్యేక కథనం :**
సామాజిక, రాజకీయ చరిత్రకారులలో కొండా లక్ష్మణ్ బాపూజీది ఒక విశిష్ట స్థానము. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత కాలపు బహుముఖ ఉద్యమ ప్రస్థానం నేటి సామాజిక తెలంగాణవాదులకు మార్గదర్శకం కాగలదు. నేడు లక్ష్మణ్ బాపూజీ యొక్క 111వ జయంతిని నిర్వహించుకుంటున్నాము. ఈ సందర్భంగా వారి జీవిత ప్రస్థానమును సంస్మరించుకోవడం ఎంతో ముదావహం.

**బాల్యం - విద్యాభ్యాసం**
కొండా లక్ష్మణ్ బాపూజీ సెప్టెంబర్ 27, 1915లో నాటి ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో జన్మించారు. తన మూడవ ఏటనే తల్లిని కోల్పోవడం, దిగువ మధ్యతరగతి పద్మశాలి కుటుంబం కావడంతో ఒక సేవాఘర్‌లో బాల్యం గడిచింది. పాఠశాల విద్య ఆసిఫాబాద్‌లో, న్యాయశాస్త్ర విద్య హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి తన 25వ ఏటనే న్యాయవాద వృత్తిని చేపట్టారు. అభ్యుదయ సామాజికవాది కావడం చేత నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా పోరాడే ఉద్యమకారులకు శిక్షలు పడకుండా వాదించేవారు.

**స్వాతంత్ర్య పోరాటం**

ఫాసిస్టు బ్రిటిష్ పాలనలో 1938లో పౌర హక్కుల ఉద్యమ సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టై జైలు జీవితం గడిపారు. 1940లో ఆంధ్ర మహాసభలో చేరి ఖద్దరు వస్త్రాల ప్రచారం చేశారు. 1941లో గాంధీజీ బహిరంగ సభకు హాజరై, ఆయన ఉపన్యాసానికి ప్రభావితమై స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు. 1942లో వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా హైదరాబాదులోని అబిడ్స్ పోస్ట్ ఆఫీస్ మరియు కోఠిలోని బ్రిటిష్ రెసిడెన్సీపై జాతీయ జెండా ఎగురవేసి సంచలనం సృష్టించిన ధైర్యశాలి కొండా లక్ష్మణ్ బాపూజీ.స్వాతంత్ర్యం అనంతరం హైదరాబాద్ నిజాం నవాబు ప్రోద్బలంతో ఏర్పడిన రాక్షస రజాకార్లకు వ్యతిరేకంగా 'సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీ' ఏర్పాటు చేసి ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. 1947 డిసెంబర్ 4న నిజాం నవాబు కారుపై నలుగురు ఉద్యమకారుల చేత బాంబు వేయించి సవాలు విసిరారు. ఈ బాంబు దాడి ప్రణాళిక రచించినందుకుగాను లక్ష్మణ్ బాపూజీ జైలు జీవితం గడిపారు. భూస్వామ్య ఆక్రమణలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మద్దతు ప్రకటించి, ఉద్యమకారులను జైలు నుండి విడిపించుటకు కోర్టులలో పోరాడి విజయం సాధించారు.

**సహకార సంఘాల వ్యవస్థాపనం**
పద్మశాలీల కులవృత్తి అయిన చేనేత దైన్యస్థితి చూసి తట్టుకోలేక చేనేత సహకార సంఘాల విరివి స్థాపనకు పూనుకున్నారు. ఇది ఉద్యమ రూపం దాల్చి దేశవ్యాప్త సహకార సంఘాల స్థాపనకు శ్రీకారం చుట్టింది. పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేపట్టి సంయుక్త ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించి చేనేత సహకార సంఘాల స్థాపన, వాటి అభివృద్ధి, చేనేత వస్త్రాల విక్రయాలకు ప్రచారం చేశారు.సంయుక్తాంధ్ర ప్రదేశ్‌లో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తాను వ్యక్తిగతంగా నిధులు సేకరించి బాధితుల పునరావాసానికి కృషి చేసిన మానవతావాది కొండా లక్ష్మణ్ బాపూజీ.

**రాజకీయ జీవితం**
1952లో కాంగ్రెస్ పార్టీ తరపున ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా గెలిచారు. ఈ కాలంలో కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ స్వపక్షంలో విపక్షవాదిగా పేరుగడించారు. 1957లో చిన్న కొండూరు నియోజకవర్గం నుండి శాసన

సభ్యుడిగా గెలిచి డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించారు. 1967లో భువనగిరి నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా గెలిచి, ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి గారి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా సేవలందించారు. 1969లో తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతమైన సందర్భంలో, ఉస్మానియా విద్యార్థుల కోరిక మేరకు తన మంత్రి పదవికి రాజీనామా చేసి తెలంగాణ వాదాన్ని ఉగ్రరూతలూగించారు.

1972లో భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1973లో పి.వి. నరసింహారావు గారి తర్వాత తెలంగాణ వాదాన్ని వదులుకుంటే ముఖ్యమంత్రి పీఠాన్ని ఇస్తానని ఇందిరా గాంధీ గారు ప్రతిపాదించినప్పటికీ, పదవిని తృణప్రాయంగా వదులుకొని తెలంగాణ వాదాన్ని భుజానికెత్తుకున్న నిఖార్సయిన త్యాగమూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ గారు. తదనంతరం ఆయన సేవలను గుర్తించి పార్టీ గవర్నర్ పదవిని ఇవ్వజూపినా సున్నితంగా తిరస్కరించి తన ప్రత్యేక తెలంగాణ వాదాన్నే ముందుకు నడిపించారు. స్వతంత్ర భారతావనిలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కొరకు వేయబడిన అతిముఖ్యమైన కమిషన్ బి.పి. మండల్ కమిషన్. మండల్ కమిషన్ నివేదికను ఆమోదించడానికి అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారు విముఖత చూపినప్పుడు, దానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికే రాజీనామా చేసిన గొప్ప బీసీ అభ్యుదయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ. 1996 సంవత్సరంలో మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదుతూ 'తెలంగాణ పీపుల్స్ పార్టీ'ని స్థాపించారు. తదనంతరం నెక్లెస్ రోడ్డులోని తన సొంత నివాసమైన 'జలదృశ్యం'ను సమైక్య ఆంధ్ర పాలకుడైన చంద్రబాబు ప్రభుత్వం కూల్చివేయగా, కోర్టులో న్యాయపోరాటం చేసి గెలిచి ఆంధ్ర పాలకుల వివక్షాపూరిత కుట్రలను ఎండగట్టారు. తన కష్టార్జితమైన జలదృశ్యాన్ని నాటి ఉద్యమ పార్టీకి వేదికగా ఇవ్వడం వలనే టిఆర్ఎస్ పార్టీ అక్కడ పురుడు పోసుకుంది. ఆ తర్వాత ఆయన హైదరాబాదులోని అశోక్ నగర్‌లో ఒక చిన్న అద్దె గృహంలో నిరాడంబర జీవితం గడిపారు.

**సంకల్పబలం**
2012లో తన 96వ ఏట ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ పోరాటం లక్ష్మణ్ బాపూజీ యొక్క సిద్ధాంత నిబద్ధత, కార్యసాధక దక్షత, స్వార్థమెరుగని నైజం మరియు రాజకీయ మకిలి అంటని ఒక యోధుని సంకల్ప బలానికి నిదర్శనం. తన మాతృభూమి రుణం తీర్చుకోవడం కోసం వాంకిడిలో 'కొండా లక్ష్మణ్ సేవా సదన్'ను స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగించిన సేవాతత్పరుడు. 2012 సెప్టెంబర్ 21న తన 97వ ఏట వృద్ధాప్య సమస్యలతో హైదరాబాదులో కన్నుమూశారు.

**ఉద్యమ యోధుడికి గుర్తింపు**
2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత హైదరాబాదులోని హార్టికల్చర్ యూనివర్సిటీకి 'శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ'గా నామకరణం చేశారు. అలాగే 15 అడుగుల లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, వారి జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. అయినప్పటికీ బహుముఖ ప్రజ్ఞాశాలి, నిస్వార్థ రాజకీయ, సామాజిక పోరాట యోధుడైన కొండా లక్ష్మణ్ బాపూజీకి దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**నివాళి కర్తవ్యం**
కాళోజీ నారాయణరావు గారు చెప్పినట్లు రక్తసంబంధీకులు ఆస్తులు పంచుకుంటారు సామాజిక సంబంధికులు ఆశయాలు పంచుకోవాలి.అనే నినాదాన్ని ఆదర్శంగా తీసుకొని కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయమైన సామాజిక తెలంగాణ సాధనకై సామాజిక ఉద్యమకారులు నిస్వార్థంగా నడుం బిగించాల్సిన అవసరం ఉంది. కమ్మరి,కుమ్మరి, వడ్రంగి, కల్లుగీత మరియు చేనేత మొదలగు కుల వృత్తులని నమ్ముకున్న బడుగు జీవుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సహకార సంఘాలను బలోపేతం చేయాలి. కేంద్ర ప్రభుత్వంలో వెనుకబడిన మంత్రిత్వ శాఖలు నెలకొల్పి రాజ్యాంగ సవరణ ద్వారా సబ్ ప్లాన్ విధానంలో విరివిగా నిధులను కేటాయించాలి. జనగణనలో కుల గణనతోపాటు కుల వృత్తుల గణన కూడా జరగాలి. కుల వృత్తుల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే బాధ్యతలను ప్రభుత్వాలు చేపట్టి ప్రణాళికలు రూపొందించాలి. అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన చేతి వృత్తుల ఉత్పత్తులను ఎక్స్పోర్ట్ చేయడానికి టాక్స్ రాయితీలి స్తూ అవకాశాలు కల్పించాలి. అంతరిక్ష పరిశోధనల కై అభివృద్ధి చెందిన స్కై రూట్స్ వంటి స్టార్ట్ అప్లే కాకుండా, సామాజిక ఆర్థిక సాధికారికత కొరకు పరిశోధనలు జరిపే సామాజిక స్టార్టప్స్ నెలకొనాలి. దీనికై సోషల్ ఇంజనీరింగ్ కోర్సులను అత్యున్నత విద్య ప్రమాణాలు కలిగినIIT, NIT లలో ప్రవేశపెట్టాలి.కుల వృత్తులపై సానుభూతి కాకుండా వారి సాధికారికత కొరకు వృత్తుల వారిగా వృత్తిపరమైన కార్పొరేషన్లు ఏర్పరచాలి. వాటికి సబ్ ప్లాన్ విధానంలో బడ్జెట్ కేటాయింపులు జరగాలి. ఇవన్నీ సాధించడానికి లక్ష్మణ్ బాపూజీ జీవిత ఆశయాలను దిక్సూచిగా తీసుకునే సామాజిక నాయకత్వం కావాలి. సామాజిక సంఘాల ఐక్య పోరాటాలు జరగాలి. అది మాత్రమే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అవుతుంది.



డా. పెండెం భాస్కర్
సీనియర్ ఉపాధ్యాయులు
9491318448

# చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన మోకుదెబ్బ రమేష్ గౌడ్

**ఉద్యమపోరు, న్యూ శాయంపేట, సెప్టెంబర్ 26 :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం న్యూ శాయంపేటలోని ఆ మహనీయురాలి విగ్రహానికి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, GWMC కమిషనర్ టి. వెంకన్న, హాసన్ పర్తి మండలం మల్లారెడ్డి పల్లి పి ఏ సి ఎస్ చైర్మన్ భయగాని కుమారస్వామి గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా నాయకులు బండారి జనార్ధన్ గౌడ్ తదితరులు చాకలి ఐలమ్మ కు పూలమాలలు వేసిఘనంగానివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రజక సంఘాల నాయకులు, బీసీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా లోకానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకం: బీఆర్ఎస్ నేతలు

- నర్సంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ఉద్యమపోరు, నర్సంపేట, సెప్టెంబర్ 26 :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నర్సంపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... "భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పాలకుర్తి గడ్డ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ" అని కొనియాడారు. ఆమె పోరాట పటిమ యావత్ మహిళా లోకానికి ఆదర్శమని, మహిళలందరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.

**భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు:**
ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, మునిగాల వెంకట్ రెడి, నల్ల మనోహర్ రెడి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, మచ్చిక నరసయ్య పాల్గొన్నారు.వీరితో పాటు జిల్లా నాయకురాలు దార్ల రమాదేవి, జిల్లా నాయకులు గోనె యువరాజు, మండల శ్రీనివాస్, శివరాత్రి స్వామి, రాయిడి దుష్యంత్ రెడ్డి, దొమ్మటి సంతోష్, నాగిశెట్టి ప్రసాద్, శీలం రాంబాబు, వాసం కరుణ సాంబయ్య, పెండెం వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి

రాంప్రసాద్, కడారి కుమార్, పులిగిల్ల యాదగిరి, కొల్లూరి లక్ష్మీనారాయణ, రాయరాకుల సారంగం, ఐలోని శ్రీను, సుధాకర్ లాల్, కందికొండ శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, నాయిని వేణు, మోడం విద్యాసాగర్, పల్నాటి సాంబయ్య, సంపంగి సాలయ్య, పైసా ప్రవీణ్, కొప్పు భాస్కర్, వరంగంటి వెంకన్న, గుండెబోయిన శివకోటి, దోనాల రవి, అడప రాంబాబు, నీరటి రంజిత్, కొమ్మ వీరస్వామి, చాపర్తి భిక్షపతి, మహిళా నాయకురాళ్లు చింతం విజయరాణి, ఎస్.కె. కాజాబీ, అలాగే మండల సత్యం, వేల్పుల శ్రీను, వేల్పుల సురేష్, రాపోలు శ్రీను, తాబేటి రాజేందర్, ఎన్. రెడ్డి వీరారెడ్డి, దినేష్, మండల సంతోష్ తదితర పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బస్సుల వేళల సమాచారానికి విచారణ కేంద్రం నంబర్ ఏర్పాటు

### - డిపో మేనేజర్ ఎం. సరస్వతి వెల్లడి

**ఉద్యమ పోరు, నర్సంపేట, సెప్టెంబర్ 26 :** నర్సంపేట ఆర్టీసీ డిపో బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల బయలుదేరు సమయాలు, ఇతర వివరాలు తెలుసుకునేందుకు ప్రయాణికుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు డిపో మేనేజర్ ఎం. సరస్వతి తెలిపారు. ఈ మేరకు నర్సంపేట బస్టాండ్‌లోని ఎంక్వైరీ (విచారణ) కేంద్రంలో 7382926166 నంబర్ అందుబాటులో ఉంటుందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, సమయానికి అనుగుణంగా ప్రయాణాలు సాగించేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# ఘనంగా ప్రపంచ పర్యటక దినోత్సవం

### - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**ఉద్యమపోరు, మహబూబాబాద్, సెప్టెంబర్ 26 :** అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మండలం, కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గ్రామ ప్రజలు కోలాటం, చిరుతల రామాయణం, బతుకమ్మలు, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘనంగా స్వాగతం పలికారు.పురాతన శివాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు,చెరువు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు, జిల్లాలోని పర్యటక ప్రదేశాలపై పాఠశాల విద్యార్థులు వేసిన పెయింటింగ్, ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు,అనంతరం జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ కురవి వీరభద్ర స్వామి ఆలయం, కందికొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, వెంకటేశ్వర ఆలయం నరసింహులపేట, బయ్యారం పెద్ద చెరువు, మత్తడి, అనంతరం, భీముని పాదం, గుంజేడు ముసలమ్మ తల్లి ఆలయం, పురాతనమైన ఆలయాలు ఏడు బావులు, కంబాలపల్లి పెద్ద చెరువు, గ్రీన్ హిల్స్ క్యాంపింగ్, పులిమడుగు క్యాంపింగ్, బయ్యారం జలపాతం, పర్యటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్య చర్యలతో ముందుకు సాగుతున్నామని, జిల్లాలోని పర్యటక ప్రదేశాలను విస్తృత ప్రచారం గావించుటకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్ప్లెన్సర్స్ , జిల్లాకు చెందిన సినీ ప్రముఖులు, టీచర్స్, కవులు, రచయితలు, ప్రజా ప్రతినిధులు,యూట్యూబర్స్, జిల్లాలోని ప్రజలు ప్రముఖులు, విద్యార్థినీ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలనీ పర్యటక ప్రదేశాల ద్వారా గ్రామాలు జిల్లా అభివృద్ధి చెందుతుందని, జిల్లాలో 49 శాతం అడవి ఉందని అందులో ఎంతో అద్భుతమైన టూరిజం స్పాట్స్ ఉన్నాయని, కల్చర్, టెంపుల్ , ఎకో, అన్ని

రకాల టూరిజం మన జిల్లాలో కలదని, ప్రతి ఒక్కరూ ఆ విషయాలపై ప్రమోట్ చేయాలన్నారు, కల్చర్ పై క్లుప్తంగా బుక్కు రాసిన రమేష్ ని అభినందించారు,పర్యాటక ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దుటకు ప్రతీ ఒక్కరూ బాధ్యత యుతంగా కృషి చేయాలని సూచించారు, పర్యటక రంగం అభివృద్ధి చెందుతే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తద్వారా జిల్లా ఆర్థికంగా స్థిరంగా ఉంటుందన్నారు, ప్రపంచంలోని కొన్ని దేశాలు, మనదేశంలోని నార్త్ ఈస్ట్ లలో గోవా, మేఘాలయ, అస్సాం, తదితర ప్రదేశాలు కేవలం టూరిజం పై ఆధారపడి ఉంటుందని అక్కడి స్థానిక ప్రజలు పర్యటక ప్రాంతాలను, ఓన్ చేసుకుని అటవీ ప్రాంతాలను కఠిన నిబంధనలతో సంరక్షించుకుంటారన్నారు, ఏ విధంగా అయినా ప్రకృతికి విగాథం కలిగించకుండా నిబంధనలు పెట్టుకుంటారన్నారు, అదే స్ఫూర్తితో మన జిల్లాలో కూడా సర్పంచులు, ఫారెస్ట్ అధికారులు, టూరిజం నోడల్ అధికారి, బాధ్యతాయుతమైన టూరిజంను పెంపొందించడం కోసం కృషి చేయాలన్నారు,పాఠశాలలలో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయడం జరిగింది అందులో చర్చించుకుని జిల్లాలోని టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయాలన్నారు, జిల్లాలో ఉన్న పర్యటక ప్రదేశాలను పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సందర్శించాలని కానీ తగిన నిబంధనలు పాటిస్తూ సొంత వస్తువులను తీసుకువెళ్లాలని ప్లాస్టిక్స్ నివారణ కచ్చితంగా పాటించాలని, పిల్లలు మీరు అలవాటు చేసుకుని ఇతరులకు చెప్పాలని సూచించారు, ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన టూరిజం నోడల్ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ఇన్చార్జి లోకల్ బాడీ పురుషోత్తం, ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లను, స్థానిక గ్రామ సర్పంచ్, ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటలో కీలక భూమిక పోషించిన తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్యులను, స్థానిక గ్రామ కళాకారులను, విద్యార్థినీ, విద్యార్థులను, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన వివిధ పాఠశాలల పిల్లలను గ్రామ కళాకారులను, శాలువా మెమొంటోతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్ చిరకా వసంత –ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కమటం యాకన్న, గ్రామ ప్రజలు ప్రజలు కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి : ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**ఉద్యమపోరు, వరంగల్, సెప్టెంబర్ 26 :** వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటించడంతో పాటు ఉద్యోగుల ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరేలా కృషి చేయాలని కోరారు.వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ అన్ని రంగాల్లో కష్టపడి పనిచేసి రాష్ట్రంలోనే వరంగల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, నర్సంపేట యూనిట్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కార్యదర్శి మహేందర్, జిల్లా బాధ్యులు చిరంజీవి, ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### - డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**ఉద్యమపోరు, వరంగల్ జిల్లా / పర్వతగిరి, సెప్టెంబర్ 26 ):** ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శం అని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ సాయుధ

పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం, ఆమె చూపిన తెగువ, ఆత్మగౌరవం చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
శనివారం 26.09.2026

# కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

- సిబ్బంది విధులు, గ్రామాల సందర్శనలు, రాత్రి గస్తీపై ఆరా
- ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి
- ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

**ఉద్యమపోరు, కేసముద్రం, సెప్టెంబర్ 26 :** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు మరియు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్ఐ క్రాంతి కిరణ్‌తో స్టేషన్ సిబ్బంది విధుల కేటాయింపు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్ సిబ్బందితో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి రోజువారీ విధులు, గ్రామాల సందర్శనలు, బీట్ విధులు, VPO (Village Police Officer) విధుల నిర్వహణ, గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, రాత్రి గస్తీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలు, నేర ప్రవృత్తులు మరియు అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని సూచించారు.VPOలు తమకు కేటాయించిన గ్రామాల్లో నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామస్థులతో సమన్వయం పెంచుకోవాలని, గ్రామంలో జరిగే ముఖ్యమైన పరిణామాలు, నేరాలకు సంబంధించిన సమాచారం మరియు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్పీ ఆదేశించారు.రాత్రి గస్తీని మరింత పటిష్టం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. డయల్ 112కు వచ్చే అత్యవసర కాల్స్‌పై సిబ్బంది తక్షణమే స్పందించి, బాధితులకు వేగంగా పోలీస్ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగంపై నిఘా పెంచి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలను కలిసే సమయాన్ని (Visiting Hours) తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఈ సమయంలో ప్రజల సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, అతివేగం మరియు ట్రాఫిక్ నిబంధనలపై గ్రామాలు, విద్యాసంస్థలు మరియు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పోలీస్–ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు.ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసులకు తెలియజేసే విధంగా నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందిస్తూ బాధితులకు మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు నిరంతరం అప్రమత్తంగా ఉండి, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును ప్రదర్శించాలని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సిబ్బందికి సూచించారు.

# బీఆర్ఎస్ కార్యాలయంలో వీరవనిత ఐలమ్మకు ఘన నివాళి

**ఉద్యమపోరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చర్ల, సెప్టెంబర్ 26 :** చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో నిజాం పాలకులు, విస్నూర్ దేశ్‌ముఖ్ వంటి భూస్వామ్య దొరల అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన ధైర్యసాహసోపేత పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన భూమి కోసం పోరాడిన ఐలమ్మ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి ఉద్యమంలో ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, ఎడ్ల రామదాసు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, తడికల బుల్లబ్బాయి, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, వేములవాడ కృష్ణ, అంకాల శ్రీను, గంధం రాజుతో పాటు రజక సంఘం నాయకులు రేగళ్ల సుధాకర్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**ఉద్యమపోరు, హనుమకొండ / కే యూ, సెప్టెంబర్ 26 :** విద్యార్థులకు లభించే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని, తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సూచించారు. పరిశ్రమలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు.కేయూ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షతన హ్యూమానిటీస్ భవనంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన జాబ్ డ్రైవ్ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం డొమైన్ పరిజ్ఞానం ఉంటే సరిపోదని, హార్డ్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సమూహ చర్చల్లో మంచి సమాచార మార్పిడి నైపుణ్యాలను ప్రదర్శించేలా విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. ప్రారంభ వేతనం కంటే మంచి అవకాశం, పరిశ్రమలో అనుభవం, భవిష్యత్ అభివృద్ధికి దోహదపడే అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ విద్యార్థులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ముందస్తుగా సిద్ధం కావాలని సూచించారు. ఒక అవకాశం చేజారినంత మాత్రాన నిరాశ చెందకుండా, లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం ప్రయత్నించాలని అన్నారు. జాబ్ డ్రైవ్‌లో భాగంగా ప్రాథమిక రాత పరీక్షలతో పాటు ఇతర ఎంపిక ప్రక్రియలు కొనసాగుతున్నాయని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. విప్రో, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, బ్రాంజ్ ఐక్యూఐటీ ప్రైవేట్ లిమిటెడ్, మెహతా సర్వీస్ ఇంజనీర్స్, కీయా మోటర్స్, ఐటీసీ హైదరాబాద్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, జోయాలుకాస్ తదితర సంస్థలు జాబ్ డ్రైవ్‌లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు సాయంత్రం వరకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్శ్య ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ చీకటి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, విప్రో సంస్థ మానవ వనరుల విభాగం అధికారిణి లహరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంతోష్ ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

- ఖమ్మంపల్లికి చెందిన 37 ఏళ్ల వ్యక్తి అదృశ్యం
- ఆచూకీ తెలిసిన వెంటనే సమాచారం ఇవ్వాలని ముత్తారం ఎస్ఐ రవికుమార్ విజ్ఞప్తి

**ఉద్యమపోరు, పెద్దపల్లి జిల్లా / ముత్తారం, సెప్టెంబర్ 26 :** ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల సంతోష్ (37), తండ్రి సత్తయ్య కొంతకాలంగా కనిపించకుండా పోయినట్లు ముత్తారం పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సంతోష్ మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సంతోష్‌ను ఎవరైనా చూసినా, ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారం తెలిసినా వెంటనే ముత్తారం ఎస్ఐ 8712656531, 9866789884 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సంతోష్ ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు. సంతోష్ వివరాలను విస్తృతంగా ప్రచారం చేసి, ఆయనను సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

# రామాలయానికి శ్రీమద్భాగవతం గ్రంథాల బహూకరణ

**ఉద్యమపోరు, ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 :** ఇస్కాన్ దేవాలయం, వరంగల్ ఆధ్వర్యంలో శ్రీమద్భాగవతం గ్రంథాలను ఏటూరునాగారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి బహూకరించారు. మాతాజీ ఇర్సవడ్ల నారాయణమ్మ, శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్‌కుమార్, చెన్న కోటమ్మ, శ్రీరామకృష్ణదాస్, మంచోజు రాణి–వెంకటేశ్వర్లు దంపతుల సహకారంతో పద్దెనిమిది పుస్తకాలు, పన్నెండు స్కందాలతో కూడిన శ్రీమద్భాగవతం సంపుటాలను ఆలయ అర్చకులు యల్లప్రగడ నాగేశ్వరరావు శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయంలో అర్చకులు ప్రతిరోజూ శ్రీమద్భాగవతాన్ని ప్రవచన రూపంలో భక్తులకు బోధిస్తారని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు రామాలయ ప్రాంగణంలో జరిగే భాగవత ప్రవచనాలకు భక్తులు హాజరై ఆధ్యాత్మిక సందేశాలను వినాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్‌తో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పునాదిరాళ్లు : ఇనగాల వెంకట్రామిరెడ్డి

**ఉద్యమపోరు, హన్మకొండ, సెప్టెంబర్ 26 :** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. భట్టుపల్లి ప్రాంతంలో 44, 45, 46వ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, ఐక్యతతో పని చేయాలని అన్నారు. డివిజన్ల వారీగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సమావేశంలో నాయకులు సూచించారు. కార్యక్రమంలో 44, 45, 46వ డివిజన్ల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం.

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్.

**ఉద్యమపోరు, ఏన్కూర్, సెప్టెంబర్ 26 :** ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం గ్రామంలో ఇంద్ర మిల్లు నిర్మించుకున్న లబ్దిదారుల గృహప్రవేశ మహోత్సవానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని , ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఎవరు అధైర్య పడవద్దు అని ఆయన హామీ ఇచ్చారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయట మే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు . కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఇంటి యజమాని కుమారుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, నల్లమల శివకుమార్ ఓబీసీ మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు,కొప్పుల ప్రభావతి రెడ్డి ,పంతగాని నరేష్, స్వర్ణ కృష్ణయ్య, స్వర్ణ శ్రీనివాసరావు గుత్తా నాగేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి

**ఉద్యమపోరు, శామీర్‌పేట, సెప్టెంబర్ 26 :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం–2026లో భాగంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో శామీర్‌పేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో శనివారం 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డే కేర్ సెంటర్లు వయోవృద్ధులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా అవసరమైన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, సంక్షేమ శాఖ పర్యవేక్షకులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేబర్తి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం

**ఉద్యమపోరు, మర్కూక్, సెప్టెంబర్ 26 :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం చేబర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టేకుమల్ రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం శనివారం గ్రామస్తులు, బందువులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రవీందర్ రావును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు మాట్లాడుతూ తన సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తి జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. తన విద్యార్థి దశను, ఉపాధ్యాయ వృత్తిలో ఎదురైన మధుర అనుభూతులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకుంటూ కాస్త భావోద్వేగానికి లోనయ్యారు. తన విధి నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు రామ్ సాగర్ లక్ష్మణ్ గౌడ్ హాజరయ్యారు. తన గురువు రవీందర్ రావు గురించి ఆయన సభలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. సార్ కేవలం చదువు మాత్రమే చెప్పలేదని, తమ జీవితాలకు ఒక మార్గాన్ని చూపించారని కొనియాడారు. తన ఎదుగుదలలో గురువు గారి పాత్ర మరువలేనిదని చెబుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. రవీందర్ రావు సార్ కేవలం చదువు మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించి తన ఎదుగుదలకు కారణమయ్యారని అన్నారు. ఈ వీడ్కోలు మహోత్సవంలో చేబర్తి గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, మాజీ సర్పంచ్ ఎర్రబాగు అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు, రవీందర్ రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

# 30 లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు పూర్తి చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా

**ఉద్యమపోరు, నిజామాబాద్, సెప్టెంబర్ 26 :** రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు స్పష్టమైన గడువు విధించారు.నిజామాబాద్ నగరం సహా ఆర్మూర్,బోధన్,రుద్రూర్,మోర్తాడ్,బాల్కొండలలో అర్హులైన లబ్దిబారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన చోట లబ్దిదారులకు కేటాయింపులు జరుపుతున్నామని,ఇదే తరహాలో మిగతా చోట్ల కూడా ఈ నెలాఖరు లోగా కేటాయింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అర్హులైన లబ్దిదారుల జాబితాను సమగ్ర పరిశీలన జరపాలని,ఆ జాబితా ఆధారంగా డ్రా పద్దతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలన్నారు.జాబితాలో అనర్హులు ఉంటే వారి పేర్లను తొలగిస్తూ,అనర్హతకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.ప్రభుత్వం నిరేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,దివ్యాంగులు తదితర కేటగిరీల వారీగా నిర్దేశించిన రిజర్వేషన్ల మేరకు రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు.ఎలాంటి తప్పిదాలు,అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు జరపాలని అన్నారు.క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందేననీ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,హౌసింగ్ ఏ.ఈ నివర్తి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 5-95-99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

- మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఏ. రాజేశం సమీక్ష

**ఉద్యమపోరు, మల్కాజిగిరి, సెప్టెంబర్ 26 :** హెచ్ఐవీ, క్షయ వ్యాధి నియంత్రణకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేసి, 95–95–99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, క్షయ కార్యక్రమ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డా. ఏ. రాజేశం సూచించారు. మానిటరింగ్ అండ్ అసెస్‌మెంట్ ఆఫ్ సర్వీసెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాజిగిరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించిన ఆయన హెచ్ఐవీ, క్షయ సేవల అమలుతీరును పరిశీలించారు.ఆసుపత్రిలోని సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం రికార్డులు, రిజిస్టర్లు, పనితీరు సూచికలను పరిశీలించారు. ప్రతి నెల నిర్వహిస్తున్న హెచ్ఐవీ పరీక్షలు, గుర్తిస్తున్న పాజిటివ్ కేసులు, వారిని యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేస్తున్న తీరును సమీక్షించారు. హెచ్ఐవీ–క్షయ వ్యాధి పరస్పర రిఫరల్ విధానాన్ని పరిశీలించి, పరీక్షా కేంద్రం నుంచి క్షయ నిర్ధారణ కేంద్రానికి, అక్కడి నుంచి పరీక్షా కేంద్రానికి జరుగుతున్న రిఫరల్స్, అనుసంధానం, లబ్దిదారుల అనుసరణ వివరాలను తెలుసుకున్నారు.క్షయ సేవలపై సమీక్షఅనంతరం సీబీనాట్ కేంద్రాన్ని సందర్శించి క్షయ వ్యాధికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. హెచ్ఐవీ–క్షయ సహవ్యాధి ఉన్న వారికి అందుతున్న చికిత్స, అనుసరణ, చికిత్స స్థితిపై వివరాలు తెలుసుకున్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న అర్హులైన వారికి నిర్వహిస్తున్న వైరల్ లోడ్ పరీక్షలు, వైరల్ లోడ్ అణచివేత స్థితిని సమీక్షించారు.రక్తనిధి కేంద్రం పరిశీలనఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం స్వచ్ఛంద రక్తదానాల సేకరణ, రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా హెచ్ఐవీ పరీక్షల పరిస్థితిని సమీక్షించారు. రక్త పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారిని చికిత్సకు అనుసంధానం చేయడం, అనుసరణ కొనసాగిస్తున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రెండో 95 లక్ష్యంపై దృష్టిమేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇప్పటికే మొదటి, మూడో 95 లక్ష్యాలను సాధించిందని డా. రాజేశం తెలిపారు. ప్రస్తుతం రెండో 95 లక్ష్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితులను యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేసి, వారు క్రమం తప్పకుండా చికిత్స పొందుతున్నారో లేదో నిర్ధారించాలని చెప్పారు.జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ఆరోగ్య సంస్థలను జిల్లా బృందం సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న హెచ్ఐవీ బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు. అవసరమైన వారిని సంబంధిత కార్యక్రమ సేవలకు అనుసంధానం చేయడంతో పాటు చికిత్స కొనసాగింపు, అనుసరణను పటిష్ఠం చేయాలని అన్నారు. ఖచ్చితమైన నమోదు, సకాలంలో రిఫరల్స్, ఆసుపత్రుల మధ్య సమన్వయం, నిరంతర అనుసరణ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ, క్షయ సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సంయోజకుడు బాబు రావు, కార్యక్రమ అధికారి డా. వై. శ్రీదేవి, వైద్య పర్యవేక్షణాధికారి డా. రాధ, ఆర్ఎంఓ డా. మాధురి, పీఆర్ఓ డా. పి. వినోద్, డిషా సీపీఎం సంజీవ్, ఐసీటీసీ సలహాదారు రమేష్, ఎస్ఎస్‌కే మేనేజర్ కల్పనతో పాటు క్షయ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

**ఉద్యమపోరు, ముత్తారం, సెప్టెంబర్ 26 :** ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో శనివారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు,పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము,జీలుగు,పిల్లిపెసర వంటి పంటలను సాగు చేయడం,పశువుల పేడ,వర్మీకంపోస్ట్ వినియోగం,అంతర పంటల సాగు చేపట్టాలని అన్నారు.అలాగే జీవ ఎరువులైన అజోల్లా,అజోస్పైరిలం,పీఎస్‌బీ,అజటోబాక్టర్,జీవ శిలీంద్ర నాశనులైన ట్రైకోడెర్మా విరిడీ,సూడోమోనాస్, సహజ కీటక నాశనిగా వేపనూనె,వేపపిండి వంటి వాటిని వినియోగించాలని సూచించారు.రైతులు పంటలతో పాటు ఆవులు,గేదెలు,ఎడ్లు,మేకలు,కోళ్లు వంటి పశుపక్ష్యాదులను పెంచుకుంటూ సమగ్ర వ్యవసాయం చేపట్టాలని కోరారు.దేశవాళీ జాతులైన గిర్,సహివాల్,ఒంగోలు ఆవుల పెంపకాన్ని ప్రోత్సహించాలని అన్నారు.ఆవు పేడ,ఆవు మూత్రంతో తయారు చేసే జీవామృతం,బీజామృతం వంటి ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్లను వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మచ్చపేట సర్పంచ్ చిలువేరి జ్యోతి లక్ష్మణ్,వార్డ్ మెంబర్ సాగర్,ఏఈఓ శశిధర్,కృషి సఖీలు,సౌఖ్య,విత్తన ధ్రువీకరణ సంస్థ వాలంటీర్ సుమశ్రీతో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధిపై అధికారుల సమీక్ష

- **ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు-MPDO వేజన్న**

**ఉద్యమపోరు, డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 26 :** డిండి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం (జనరల్ బాడీ) నిర్వహించారు. కమలాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలో కొన సాగుతున్న వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మండలంలోని ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే గ్రామ పంచాయతీల పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో వేణజ, తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ జంగయ్య, ఏపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సదనంలో మేజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ

- **చిన్నారుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఉద్యమపోరు, మణుగూరు, సెప్టెంబర్ 26 :** పినపాక నియోజక వర్గం మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలికల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సదనంలోని గదులు, వంటగది, ఆవరణ, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మేజిస్ట్రేట్ ముచ్చటించి భోజనం, వైద్యం, విద్య, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని సదనం నిర్వాహకులకు సూచించారు.చిన్నారులు చదువుపై శ్రద్ధ పెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మేజిస్ట్రేట్ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే సదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సేవా సంస్థల దృష్టికి తీసుకురావాలని, బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.సదనంలో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలకు మేజిస్ట్రేట్ స్వయంగా భోజన పదార్థాలను వడ్డించి, ఆహారం రుచిగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సదనం చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దీప్తి రాణి, న్యాయవాది అంకం సర్వేశ్, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్, సదనం అసిస్టెంట్ కుమారి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం

- **21 దుకాణాలకు వేలం పూర్తి.. మిగిలిన 56 దుకాణాలకు త్వరలో మరోసారి వేలం**

**ఉద్యమపోరు, శామీర్ పేట,మూడుచింతలపల్లి, సెప్టెంబర్ 26 :** మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడంతో పాటు దుకాణాల కేటాయింపులో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జాము రవి తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ దుకాణాల సముదాయానికి నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో 21 దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు, డీడీలు సమర్పించిన అభ్యర్థుల వేలం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.మొత్తం 77 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించగా, 21 దుకాణాలకు వేలం పూర్తయిందని, మిగిలిన 56 దుకాణాలకు త్వరలో కొత్తగా వేలం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వేలం ప్రకటనలో పేర్కొన్న నిబంధనలు, షరతులకు అనుగుణంగా దరఖాస్తులు సమర్పించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని చైర్‌పర్సన్ జాము రవి సూచించారు.మున్సిపల్ దుకాణాల వేలం ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తూ, మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మోర్సుబాయ్ శశిరేఖ, కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత, కొల్లాస్ రాజు, గిరిపల్లి జ్యోతి, మూడవత్ నవీన్, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్, రెవెన్యూ అధికారి అర్షద్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.

**ఉద్యమపోరు, ఏన్కూర్, సెప్టెంబర్ 26 :** ఏన్కూర్ మండల కేంద్రంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుందర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ బడుగు బలహీన వరాల హక్కులు కోసం మరియు రైతులు, పేదల హక్కులు కోసం జమీందారీ వర్గాన్ని, భూస్వామ్య వర్గాలతో పోరాటం చేసిన ధీర వనిత అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# పండుగల్లో ప్రజలకు అసౌకర్యం కలగొద్దు

- **మూడుచింతలపల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ జాము రవి**

**ఉద్యమపోరు, శామీర్ పేట, సెప్టెంబర్ 26 :** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి అధికారులను ఆదేశించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో పండుగలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చైర్మన్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ముందుగానే కల్పించాలని సూచించారు. ఆలయాల పరిసరాల్లో ప్రత్యేక విద్యుత్ సౌకర్యాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పండుగల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ జాము రవి సూచించారు. సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్, వైస్ చైర్మన్ మోర్సుబాయ్ శశిరేఖ, కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, ముద్దం పాపిరెడ్డి, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, ఆది అజయ్ కుమార్, కొంపల్లి మాధవి, దోసకాయల లత, మేడబోయిన మౌనిక, కొల్లాస్ రాజు, గిరిపల్లి జ్యోతి, వంగ ప్రియాంక, మూడవత్ నవీన్, గొంది శ్రావణి, ఇర్రి స్వప్న, బొమ్మలపల్లి మల్లేష్, ఆర్వో హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, డీఈ స్ఫూర్తి, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ మోహన్ సింగ్, ఏటీపీవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- **ఘనంగా జయంతి ఉత్సవాలు**

**ఉద్యమపోరు, నిజామాబాద్ , సెప్టెంబర్ 26 :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ,అదనపు కలెక్టర్,ఇతర జిల్లా శాఖల అధికారులు,వివిద కుల సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ జయంతి సభ జరిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని గుర్తు చేశారు.హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసి స్ఫూర్తిని నింపారని కొనియాడారు.చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని,ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు తొమ్మిది రేకుల విద్యార్థి ఎంపిక

**ఉద్యమపోరు, కేశంపేట, సెప్టెంబర్ 26 :** కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలోని శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన విద్యార్థి లాలామోని సాయి వర్షిత్ అండర్–17 విభాగంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సాయి వర్షిత్ తన క్రీడా ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి అర్హత సాధించాడు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభావంతమైన ఆటతీరును ప్రదర్శించి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ సాయి వర్షిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంఇఓ చంద్రశేఖర్, విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులు సాయి వర్షిత్‌ను అభినందించారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తే వారి ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుందని వారు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

## గణనాధుని శోభాయాత్రలో పాల్గొన్న టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి

**ఉద్యమపోరు, మహేశ్వరం, సెప్టెంబర్ 26 :** మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ, రోడ్ నంబర్ 2 నందు శివాజీ మహారాజ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణనాధుని శోభాయాత్ర ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు.వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్రను ప్రారంభించారు. భాస్కర్ రెడ్డి, మాట్లాడుతూ..అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నియోజకవర్గ ప్రజలందరూ వర్ధిల్లాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ తరహా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పిడి లింగస్వామి గౌడ్, అక్బర్, పెద్దవూర సైదులు, నాగేష్ నేత,నబీ,సుధాకర్ రెడ్డి, నాగరాజు , ఖాలీమ్, వినయ్ పృథ్వీ, జంగారెడ్డి,వల్లీ శర్మ, కిరణ్మయి జంగారెడ్డి మరియు మిత్ర మండలి ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రముఖ నాటు వైద్యుడు మృతి

- **అప్పారావు పార్థివ దేహానికి ఎమ్మెల్యే రాందాస్ నివాళులర్పించారు.**
- **అప్పారావు మృతితో గార్లఒడ్డు లో విషాదం**

**ఉద్యమపోరు, ఏన్కూరు, సెప్టెంబర్ 26 :** ఏన్కూరు మండల పరిధిలోని గార్లఒడ్డు గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు సోదరుడు ప్రముఖ నాటు వైద్యుడు శెట్టిపల్లి అప్పారావు( 90)మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గార్లఒడ్డు గ్రామానికి చేరుకుని అప్పారావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పారావు మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులకు తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఎమ్మెల్యేతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు అంతిమయాత్రలో పాల్గొని శెట్టిపల్లి అప్పారావు కు ఘనంగా నివాళులర్పించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**ఉద్యమపోరు, బోనకల్, సెప్టెంబర్ 26 :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బోనకల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లింగంనేని నళినిశ్రీ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ లింగంనేని నళినిశ్రీ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ ధైర్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు.నిజాం పాలన కాలంలో గ్రామీణ ప్రజలు భూస్వాముల పెత్తనం, వెట్టిచాకిరి, అధిక పన్నులు, సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న సమయంలో ఐలమ్మ అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని తెలిపారు. తన భూమిపై భూస్వామ్య శక్తులు హక్కు సాధించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన భూమిని కాపాడుకునేందుకు పోరాటం చేశారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం కేవలం తన కుటుంబం కోసమే కాకుండా అణగారిన ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని తెలిపారు. ఆమె స్ఫూర్తితో అనేక మంది మహిళలు సామాజిక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని అన్నారు.చాకలి ఐలమ్మ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ ముఖ్యంగా నాలుగు విషయాలను నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, తమ హక్కులను తెలుసుకోవడం, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడటం, సమాజంలో సమానత్వం మరియు ఆత్మగౌరవం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.అన్యాయం ముందు తలవంచకుండా హక్కుల కోసం ధైర్యంగా నిలబడిన చాకలి ఐలమ్మ జీవితం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

## రైతు రిజిస్ట్రేషన్, డిజిటల్ పంట నమోదు తప్పనిసరి

**ఉద్యమపోరు, శంషాబాద్, సెప్టెంబర్ 26 :** రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడంతో పాటు, తమ పంటల వివరాలను ఆన్‌లైన్ పంట నమోదు (డిజిటల్ క్రాప్ సర్వే) లో నమోదు చేయించుకోవాలని శంషాబాద్ మండల వ్యవసాయ అధికారి రాచ శ్వేత సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ద్వారా వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల కొనుగోళ్లు, ఎరువుల కొనుగోళ్లు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ముఖ్యంగా పీఎం కిసాన్ తదుపరి విడత ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే లక్ష్యంలో భాగంగానే రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. శంషాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రైతు రిజిస్ట్రేషన్ ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మీ సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరమని పేర్కొన్నారు. శంషాబాద్ మండలంలో మొత్తం 14,709 మంది పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు ఉండగా, ఇప్పటివరకు 7,575 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారు. అంటే సుమారు 51 శాతం మంది నమోదు పూర్తి చేసుకున్నారు. ఇంకా 7,134 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందని వ్యవసాయ అధికారి శ్వేత తెలిపారు. మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు, సిబ్బంది రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన వివరాల ఆధారంగానే పత్తి, మొక్కజొన్న, కందులు, వరి తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి పంట నమోదు సిబ్బంది గ్రామానికి వచ్చినప్పుడు రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేసిన పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి నమోదు చేయించుకోవాలని రాచ శ్వేత కోరారు.

# జానకంపేట్ సొసైటీలో మహాజన సభ నిర్వహణ

**ఉద్యమపోరు, నిజామాబాద్, సెప్టెంబర్ 26 :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జానకంపేట్ లో మహాజన సభ సమావేశము సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో సంఘ కార ్యద ర్శి జమ,ఖర్చులు,వ్యాపార ఖాతా, లాభ , న ష్టాల ఖాతా,సంఘ లావాదేవీలు చదివి వినిపించడం జరిగింది.అనంతరం మహాజన సభలో పలు విషయాలు చర్చించి ఆమోదించి ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది.యూరియా యాప్ పూర్తిగా తొలగించుట గురించి,సొసైటీకి గోడౌన్ నిర్మాణం కొరకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యేని కలవడం గురించి,ఎఫ్ పి ఓ లో రైతులు అందరూ మెంబర్షిప్ కచ్చితంగా చేసుకోవాలి అని,ఋణ మాఫీ కానీ వారికి వెంటనే ప్రభుత్వం స్పందించి ఋణ మాఫీ చేయాలని తీర్మానాలు చేయడం జరిగింది.మహాజన సభకు గ్రామ సర్పంచ్ అనురాధ రాధ కిషన్ గౌడ్,ఉపసర్పంచ్ నీలం కృష్ణ,సొసైటీ వైస్ చైర్మన్,డైరెక్టర్స్,జానకంపేట్ ఏఈఓ శ్రీహరి,సొసైటీ మాజీ చైర్మన్లు,ప్రజాప్రతినిధులు,రైతులు,సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు, సంఘ కార్యదర్శి,సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# జోనల్ క్రీడల్లో జడ్పీహెచ్ఎస్ కేశంపేట విద్యార్థుల సత్తా

**ఉద్యమపోరు, కేశంపేట, సెప్టెంబర్ 26 :** కేశంపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎస్‌జీఫఐ జోనల్ స్థాయి అండర్–17 క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. అండర్–17 బాలుర కబడ్డీ విభాగంలో బి.సాయి తేజ్, కార్తీక్ గౌడ్, మల్లేష్, రాకేష్ ప్రతిభ కనబరిచి జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా అండర్–17 వాలీబాల్‌లో బాలికల విభాగంలో అక్షిత, బాలుర విభాగంలో జి.కార్తీక్ రన్నరప్‌గా నిలిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విజేతలను అభినందించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు - బీజేపీ నాయకులు

**ఉద్యమపోరు, మంథని, సెప్టెంబర్ 26 :** తెలంగాణ గడ్డపైన భూమికోసం భుక్తి కోసం బానిస బ్రతుకుల విముక్తి కోసం నిజాం రజాకార్ ఆకృత్యాలకు తొత్తులుగా ఉన్న జమిందార్, దొర గడీల అఘాయిత్యాలను సాయుధ పోరాటం ద్వారా అణిచివేసి పేద ప్రజల కు దొరల ఆధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పంచిపెట్టి వారి కన్నీళ్లను తుడిచిన చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించగా పట్టణ మాజీ అధ్యక్షులు బూడిద తిరుపతి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ జయంతి వేడుకల్లో జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ మాజీ అధ్యక్షులు చిలువేర సతీష్, సీనియర్ నాయకులు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సామల అశోక్,ఎడ్ల సాగర్, పట్టణ కార్యదర్శులు పార్వతి విష్ణు, మాచిడి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com